# సూరి సిద్ధాంతం - 4

అన్ని దశలలోనూ బాల్యదశవంటిది లేదని నేను సూరితో వాదించాలని ఒకసారి ప్రయత్నం చేశాను. సూరి నాతో వాదించక, తన బాల్యాన్ని గురించి అదివరకు రాసి వుంచిన వ్యాసం చూపించి, "యిది చదువు తరువాత నీ అనుమానాలు తీరుస్తాను" అన్నాడు. ఆ వ్యాసం ఈ కింది విధంగా వుంది.

".... అనేకమంది బాల్యావస్తను శ్లాఘించగా విన్నాను. "చిన్నప్పటి ఆనందం - ఆ రోజులు - మళ్ళీ రావుకదా!" అని నిట్టూర్చటం చూశాను. క్రీస్తు కూడా వాళ్ళదే స్వర్గమన్నాడు... గే ఒక్కొక్కసారి అజ్ఞానం పరమానందమన్నాడు

నేనీ అభిప్రాయాలతో ఏకీభవించలేక పోవటంలేదు. నా బాల్యం, దాన్ని పొగమాదిరిగా ఆవరించుకుని వుండిన అజ్ఞానం యిప్పుడు తలుచుకోటానికి నాకు దుర్భరంగా వుంటుంది. పరిపూర్ణమైన జ్ఞానం కన్న బాధలేదని ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఏ దేవుడైనా నాకు వరమిస్తే బాల్యంలేని జన్మ ప్రసాదించమని వేడుకుంటాను.

ఇటువంటి పొరపాటు అభిప్రాయాలు కల లోకాన్ని దూషించి ప్రయోజనం లేదు. ఆపరేషన్ బల్లమీద రోగిబాధకు వెరచి డాక్టరును క్లోరోఫారం ఇమ్మని బతిమాలినట్టుగా, రోజల్లా శరీరకష్టం చేసినవాడు కల్లు దుకాణానికిపోయి తప్ప తాగినట్టుగా నిజాన్ని ఎదుర్కోలేని లోకం అజ్ఞానంలో ఆనందించటంలో ఆశ్చర్యం లేదు.

అజ్ఞానానికి అబద్ధానికి జరిగే ప్రచారం లోకంలో మరిదేనికీ జరగటం లేదు. చిన్నతనంలో పిల్లలకు పెద్దవాళ్ళను చూస్తే భయభక్తులు నేర్పుతారు.

"అమ్మోయ్ తాతదగ్గిర పొడుం వాసనే" అంటాడు పిల్లవాడు. వెంటనే తల్లి "ఛా! వెధవా! అలా అనవచ్చునా? ఛీ!" అని భయపెడుతుంది. తెలివిగల పిల్లవాడయితే తిట్లూ, దెబ్బలూ తప్పించుకోటానికి మరోమాటు ఆ మాట అనక పోయినా, తాతదగ్గిర పొడుంవాసన అనేమాట మరిచిపోడు. అదే మెదడులేని పిల్లవాడయితే ఆ మాట అనటం పెద్ద అపరాధమని గ్రహించి, మానసికంగా చెంపలు వాయించుకోటమే కాకుండా నిజంగా తాతదగ్గిర పొడుంవాసన లేదనే నమ్మకం తెచ్చి పెట్టుకుంటాడు.

సహజంగా మనం మొదటిరకం పిల్లవాణ్ణి అల్లరివెధవ అంటాం. రెండో రకం వాడు బుద్ధిమంతుడు!

ఎంత బుద్ధిమంతుడైన కుర్రవాడు కానివ్వండికాక, స్వతహాగా పంతులు కనపడితే నమస్కారం చెయ్యాలని కనుక్కోగలడా? ఇంకోరు చెప్పకుండా కిందనుంచోటం కన్న బెంచి ఎక్కటం హీనమని గ్రహించగలడా?

నేను వీధిబడి వదలి హైస్కూలులో తక్కువ తరగతిలో ప్రవేశించిన మొదటిరోజునే ఒక చిత్రం జరిగింది. క్లాసులోకి మేస్టరు రాగానే అంతా లేచి నుంచున్నారు. నాకిది అర్థంకాక నా పక్క వాణ్ని బలవంతాన లాగాను. వాడు నా పక్కన కూలబడి బంతల్లేలేచి దణ్ణం పెడుతూ "చూడండి సార్!" అని మేస్టరుతో ఫిర్యాదు చేశాడు. ఆయన నేను లేవనికోపం లోపల పెట్టుకుని బెంచి ఎక్కమన్నాడు. బెంచిమీద ఎక్కగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది నాకు.... తరువాత చాలా రోజులు వరకూ పంతులు క్లాసులోకి వచ్చినప్పుడు లేచి నమస్కారం చెయ్యాలనీ, బెంచి ఎక్కడం కింద నిలబడటం కన్న పెద్ద శిక్ష అని నమ్మలేక పోయినాను!

ఈ చిన్నతనాన్ని గురించి ఎట్లా గర్వపడటం...?

గట్లమధ్య ప్రవహించే నదిమాదిరిగా కుర్రవాడి ప్రకృతి తల్లి ప్రకృతిని ఒరుసుకుంటూ తల్లిదండ్రులయొక్క ప్రకృతుల మధ్యగా ప్రవహిస్తుంది. (ఈ పోలిక పోల్చటంలో కుర్రవాడి ప్రకృతి గట్లుతెగిపోవచ్చునని కూడ ఉద్దేశం.) తల్లికి, పిల్లవాడికి బంధంజాస్తి. ప్రవాహానికి వెలుపలిగట్టుతో సంబంధం తక్కువ. లోపలిగట్టు ఎన్ని వంకర్లు తిరిగితే ప్రవాహం అన్ని వంకర్లు తిరుగుతుంది. తల్లుల్లో ఎన్ని లోపాలుంటే పిల్లవాడు అన్ని లోపాలతోను బాధపడతాడు. ఆడదాన్ని చేతులారా దాస్యంలో ఉంచుతున్న ఈ వివాహ చట్టంతోనూ, ఈ న్యాయచట్టంతోనూ, ఆడదాన్ని పిరికిదాన్ని చేసేస్తున్న తండ్రి దౌర్జన్యం తోనూ, భర్త దౌర్జన్యంతోనూ, ఆడదాన్ని పశువుకన్న హీనం చెయ్యాలని ప్రయత్నం చేస్తున్న మత సంబంధమైన మోసంతోనూ స్త్రీ ధర్మశాస్త్రాల మోసంతోను. మన దేశంలో పిల్లలు ఎందుకైనా పనికి రావాలంటే, ఉన్న తల్లులు తమ పిల్లలతో రోజుకు గంట గడపటనిక్కూడా అర్హులుగా లేరు....

నాకు మా నాన్న గుణాలు అబ్బినా ఆయన్ని చూస్తే, ఒక విధమైన వైరభావం, మా అమ్మను చూస్తే ప్రేమ ఉండేది. ఆవిడమీద ప్రేమకు ప్రకృతి సిద్ధమైన స్త్రీపురుష పరస్పరాకర్షణ కారణం కావటమేకాక ఆవిడ అభిప్రాయాలూ, ఆవిడ అజ్ఞానం నా ప్రవర్తనలో లైన్ ఆఫ్ లీస్ట్ రెసిస్టెన్సుకు చాల అనుకూలంగా ఉండేవి, కుర్రవాడికి ఏదైనా నేర్చుకోటానికి, సరిగా ప్రవర్తించటానికి ప్రయత్నం కావాలి. కాని వృద్ధిలేకుండా ఉండటం చాల సులభం. అందరికీ సహజమైన ఈ బద్ధకం ఈ ఇనర్షియా నన్ను వృద్ధి లేకుండా ఉండమని ప్రేరేపించేది. మా నాన్నకు అది ఇష్టమని నాకు ఎట్టాగో తెలుసును. ఆయన

దగ్గిరికి పోవాలన్నా నిప్పును సమీపించడం మోస్తరుగా ఉండేది. ఆయన కళ్ళు గుడ్డిచేసే వెలుతురల్లే ఉండేవాడు. ఆవిడకళ్ళు గుడ్డిచేసే చీకటల్లే ఉండేవి. రెండూ ఒకటే అయినప్పుడు శ్రమపడి వెలుతురును సమీపించటం ఎందుకు? చక్కగా చీకట్లో నిద్రపోక? చీకటి చెయ్యలేని ఉపకారాలు వెలుతురు చెయ్యగలదని నాకు చెప్పినవారు లేరు.

నేను అయిదేళ్ళవాణ్ణయినప్పుడు కూడా మా అమ్మ నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని, తలనిమిరి, మొహం వాసన చూసేది. మా నాన్న పెద్దవాణ్ణి చూసినట్టు చూసేవాడు. "నీ పెంపకం మా బాగా వుంది. వాడు ప్రతిదానికీ తెలీనట్టు నటిస్తాడు! వాణ్ణి ఎందుకంత అజ్ఞానంలో పెంచుతున్నావు?'' అని ఆయన అప్పుడప్పుడూ మా అమ్మను గదమాయించేవాడు. "పసి వెధవ! వాడికప్పుడే ఏం తెలుస్తుందండీ! మీరెప్పుడూ ఇంతేను." అనేది మా అమ్మ. అప్పుడు వాళ్ళిద్దరికీ వాదన! అయిదేళ్ళ పిల్లవాడికి ఎంత తెలుసుకునేటందుకు అవకాశం వుందని! మానాన్న చెప్పింది నిజం. ఓం ప్రథమంనించే మన ఆడవాళ్ళు పిల్లలతో తొక్కుమాటలు "ఓంతే అమ్మా?" మొదలైనవి మాట్లాడకుండా వుంటే అయిదేళ్ళ కుర్రవాడికి ఇంట్లో ఎలా ప్రవర్తించవలసిందీ చక్కగా తెలీటానికి, తల్లిదండ్రులకు ఆటంకం లేకుండా తనకు కావలసిన పనులు తను చేసుకునే నేర్పు కలగటానికి అవకాశం వుంది. ఒకరిదాకా యెందుకు? పదేళ్ళు వచ్చిన తరవాత కూడా నా అంతట నేను నీళ్ళు తోడి పోసుకుని, నా అన్నం నేను కలుపుకుని ఎరగను. "నాకు పెనసలు కావాలి. ఎలా నాన్నా?" అనేరకం కుర్రవాణ్ణి చూస్తే మా నాన్నకు అసహ్యం. కారణం చెప్పకుండా – ఆ మాటకొస్తే చెప్పి అయినా డబ్బులడిగే పిల్లవాడు దుర్మార్గుడని, డబ్బులు పెద్దవాళ్ళు తాకవలసిందే కాని పిల్లలు తాకరాదని మా అమ్మ అభిప్రాయం. మా నాన్న యిష్టప్రకారం ప్రవర్తించటంలో కొంత బాధ్యత నా నెత్తిన ఎప్పుడూ ఉండేది. అది నాకిష్టం లేదు.

ఈ సందర్భంలోనే మా అమ్మకూ నాన్నకూ ఇంకో అభిప్రాయ భేదం వుండేది. నా ప్రవర్తనలో నాకు కొంత స్వేచ్ఛ ఇవ్వమనీ, పిల్లవాడి విషయంలో పరిపూర్ణమైన జాగ్రత్త వుంచటం తల్లిదండ్రులకూ అసంభవమనీ అనేవాడు. మా అమ్మకిది అఘాయిత్యంగా కనపడేది. "వాడు నిప్పులోపడి కాలిపోతున్నా చూస్తూ ఊరుకుంటారండీ మీరు!" అని కోప్పడేది ఆవిడ.

"వాడి జాగ్రత్త వాడ్ని తీసుకోనివ్వటం చాలా మంచిది. అవిటి శరీరం కన్న అవిటి మనస్సు దుర్భరమైనది!" అనేవాడు మా నాన్న. వాదనలో ఈ విధంగా అతిగా వెళ్ళటం ఆయనకు అలవాటు. నా ఉద్దేశం పిల్లవాడికి అవుడులేని శరీరం, మనస్సు కూడా ఏర్పాటు చెయ్యవచ్చునని – వెయ్యి కళ్ళతో పిల్లవాణ్ణి కాపాడనవసరం లేకుండానే.

వెయ్యికళ్ళతో కనిపెట్టి మా అమ్మ నాకు చేసిన ఉపకారం మాత్రం ఏముంది?

పెట్టుపోతల్లో మా అమ్మ వంటిది లేదని ప్రతీతి! ప్రతిపూటా నాకిష్టమైన ఆధరువు. సామాన్యంగా కందిపచ్చడిచేసి ఎక్కువ ఎక్కువగా పెట్టేది. ఒకచెంప నేను తినలేక గుడ్లు వెళ్ళుకొచ్చి కొట్టుకుంటే "పిచ్చి సన్యాసి! నీ ఆకలి నీకే తెలీదేం? చిన్న గొట్టం పోస్తే అన్నమంతా అలాగే ఉండెను! కడుపునిండా తినకపోతే ఏమవుతుందో తెలుసా? నిద్రపోతున్నప్పుడు జీవుడు వెళ్ళి పొయిమీద పెట్టబోతున్న శూద్రవాళ్ళ అన్నంకుండలో ప్రవేశిస్తాడు. వాళ్ళాకుండ పొయ్యి మీదపెట్టి మూతపెడతారు!" అనేది. ఈ మహానరకం తప్పేటందుకు మా నాన్న ముద్దా, మా అమ్మ ముద్దా మొదలైనవన్నీ బలవంతాన దిగమింగేవాణ్ణి. నాకు వారానికోసారి చచ్చేటంత జబ్బు రావటం రొండు లంఖణాలు చెయ్యటం జరుగుతుండేది. వేంకటేశ్వరస్వామికీ, పోలేరమ్మకు, సుబ్బరాయుడికీ ఇంకెవరెవరికో ముడుపులతో సహా.

తతిమ్మా విషయాల్లో నా ప్రాణానికావిడ ఇనప్పెట్టల్లే ప్రవర్తించేది. నేను బావిదగ్గిరికిపోయి బావిలో మొహంపెట్టి బోంమని అరవటానికి వీల్లేదు. రైల్లో పోతున్నప్పుడు కిటికీలోనించి బయటికివంగి రైలుపొగ వాసన చూడటానికి వీల్లేదు. నన్ను మా అమ్మ ఈ విధంగా సంరక్షించినప్పుడల్లా మా నాన్న "నీ జాగ్రత్త తీసుకోటం కాదుగాని వాణ్ణి అనాథను చేస్తున్నావు. వెన్నెల్లో కూడా బయటికి పోవటానికి భయం వాడికి!" అనేవాడు. మా అమ్మ మండిపడి "మనిద్దరం బతికి వుంటే వాడెందుకు అనాథ అవుతాడు?" అన్న దొకసారి. "దిక్కులేనివాడు అనాథకాదు, దిక్కులేకుండా జరగనివాడు నిజమైన అనాథ!" అన్నాడాయన. ఆ మాట ఆవిడకు అర్థంకాలేదు. ఎక్కువ తెలివిగలది కాదు పాపం ఆవిడ.

"వాడి కే అపాయం లేనన్నాళ్ళేగా నువు వాడికి పెట్టనికోట! వాడు మంచాన పడగానే ఏ సుబ్బారాయుడో!"

"అవునులెండి! వాడు చావుబతుకుల మీద వున్నా మీకు కనికరం వుండదు."

దానిమీదట మా నాన్న ఎగతాళిగా "అహా! యేం మాతృప్రేమ? అజీర్ణంతో వాడు మంచాన పడగానే వాణ్ణప్పుడే టపాకడుతుంది!" అంటాడు.

ఈ సందర్భంలో పిల్లలచావులను గురించి ఒక్కముక్క రాస్తాను. మనం సామాన్యంగా పిల్లలపోషణ విషయంలో బయటపెట్టుకునే అజ్ఞానం చూస్తే, రొండు మూడు సంవత్సరాల వయసులోపల ప్రతిపిల్లా, పిల్లవాడు యేక్షణం పడితే ఆ క్షణం చావటానికవకాశం వుంది. శిశు మరణం సంభవించినప్పుడల్లా తల్లి "అప్పుడే పోతావనుకోలేదో!" అని ఏడుస్తుంటే నవ్వాలో విచారించాలో తెలీకుండా వుంది. ఆ విధంగానే ప్రతివాళ్ళూ తమ ఆప్తవర్గంలో ఎవరో ఒకడు యే రోజునైనా చచ్చిపోవటానికి సిద్ధంగా వుండకపోవటం యొక్క ఫలితం

మహాఘోరంగా అనుభవిస్తారు. ఎప్పటికప్పుడు స్మశానవైరాగ్యం తెచ్చుకోవటమేగాని చావుయొక్క అవశ్యకత ఎవరూ గ్రహించినట్టు కనపడదు. చచ్చినవాళ్ళు తిరిగి పుట్టటం వున్నదని నిరూపించటానికిక్కడ చోటులేదు. వున్నదని భావించుకుంటే ఎక్కువ మంది హిందూసోదరులు తప్పుపట్టరు కనక అలాగే భావించుకుని ఒకమాట మనవిచేస్తాను. కిందటి జన్మను గురించి ఎందుకు జ్ఞాపకం వుండదని ప్రశ్న వచ్చినప్పుడు ఒకరు - వివేకానంద స్వామో, రామకృష్ణ పరమహంసో జ్ఞాపకం లేదు - కిందటి జన్మ అనేక సంవత్సరాల కిందటిది. ఈ జన్మలో విషయాలే మనం మరిచిపోతున్నప్పుడు అంతకాలం కిందటివి జ్ఞాపకం వుండటం కష్టం. అయినా కావాలని ప్రయత్నం చేస్తే జ్ఞాపకం వస్తవి. నాకు జరిగిన జన్మలు జ్ఞాపకం వున్నవని సెలవిచ్చారు. అది కావచ్చును, కాకపోవచ్చును కాని నా ఉద్దేశం అవి మరిచిపోవటంలో గొప్ప అవకాశం వుందని. అలా జ్ఞాపకమే ఉంటే నిద్రకూ, చావుకూ ఎక్కువ భేదం వుండదు. జీవితం ప్రయాణమేనని ఒప్పుకుంటాను. కాని 'తామరాకుమీద నీటిబొట్టల్లే వుండి! యీ భార్య ఎవరు? యీ కొడుకెవరు? నువ్వు చేరవలసినచోటిదేనని ఎక్కడపడితే అక్కడ ఆగదు. గమ్యస్థానం మనస్సులో వుంచుకో!" అని చెప్పగానే సామాన్య మానవుడు అర్థం చేసుకోలేడు. అసలా వేదాంతంలోనే పొరపాటున్నది. భార్యా పుత్రులు ఎవరూ కాకపోలేదు! తోడు ప్రయాణీకులు. వీళ్ళు మనతో రాలేరని అధైర్యంతోస్తే తప్ప వాళ్ళను విడనాడుకోనక్కరలేదు. నీదారిన నువ్వు నడు. అటు ఇటు చూడకుంటే పోతున్నదారి సరి అయినదేనా అని చూడవలిసి వస్తుంది. మన వేదాంతంలో వచ్చిన చిక్కేమిటంటే అది ఎవరికోసం ఉద్దేశించబడ్డదో వాళ్ళకు అర్థం కాదు. మనిషి కొంతకాలం బతికిన తరవాత ప్రయాణానికి అర్హుడు కాకుండా పోతాడు. అప్పుడు చావు వరమల్లే వస్తుంది. అందుకని ఆ చావు ప్రతి రెండు సంవత్సరాల కొకసారి వచ్చినా ప్రయాణంలో అడుగడుక్కూ కూర్చున్నట్టుంటుంది. మనకు డాక్టర్లంతా శోధనచేసి కనిపెట్టవలసిందేమిటంటే ఒక్క శరీరంతో కూర్చోకుండా ఎంతకాలం ప్రయాణం చెయ్యగలం అనేదే. బెర్నార్డ్‌షా మూడువందల ఏళ్లు కావాలన్నాడు మంచిది. నేను కూడా ఒప్పుకున్నాను! నిన్నటి బాధలు ఇవాళ జ్ఞాపకం రాకుండా ఏదైనా ఏర్పాటుంటే ప్రతి నిద్రానంతరం మనం కొత్త మనుష్యులం అవుతామన్నాడు. వెల్స్ ఏ గవర్నమెంటులోనన్నా ఏ రోజు సమస్యలు - ఇవి సామాన్యంగా శరీర సంబంధమైనవిగా వుంటున్నై - ఆ రోజే తీరిపొయ్యే ఏర్పాటు జరిగితే ప్రతినిద్రా ఒక చావు కింద ఉపయోగించుకుని - ఆ నిద్రే బాల్యంలేని పునర్జన్మ యిచ్చే చావవుతుంది. ఒకవెయ్యి జన్మల్లో సాధించగల వృద్ధి ఒక్క జన్మలో సాధించి ధన్యులం కావటానికవకాశం వుంది. అందరూ ఆలోచించండి!...

అసలు విషయం... మా అమ్మ పెంపకంలో నాకు నచ్చినదేమిటంటే - బాధ్యత

తోసెయ్యటం. నిజాన్ని కప్పిపుచ్చటం. ఎదురుగా కనపడుతున్నది లేదనుకోవటం, అబద్ధం లేక అసత్యం నాగరికతకు ఆధారమనుకోటం, నాలో నాకు నమ్మకం లేకపోవటం, నా అంత ఛండాలుడు లేడు, నాకన్న నా స్నేహితులంతా మంచివాళ్ళనుకోటం, నాకు చెయ్యాలని వుండే పనులే ఎవడయినా చేస్తే వాణ్ణి ఏవగింపుతో చూడటం. నిజం మాట్లాడేవాళ్ళు పాషాణ హృదయులనుకోటం మొదలయినవి.

నాకు మొదటినుంచి ఆడపిల్లలతో ఆడుకోటం ఇష్టం మగపిల్లలతో తిరగటం కంటె. మా నాన్న ఇటువంటి విషయాల్లో పాతపక్కీగానే వుండేవాడు. 'ఆ వెధవెందుకు ఎప్పుడూ ఆడపిల్లలతో పడి ఏడుస్తాడు? ఆడకుంక కావటానికా? సభాపిరికితనం, సిగ్గూ, మెతకతనం, తనలో విశేషం బయటపెట్టుకోలేక పోవటం మొదలయిన గుణాలన్నీ రావటానికా?' అనే వాడాయన. చిన్నతనం నించి ఆడపిల్లలనూ మగపిల్లలనూ వేరు వేరు గదుల్లో ఖయిదు చెయ్యటం వల్ల కలిగే నష్టాలు నాకు స్పష్టంగా తెలుసును. కాని ఆయన అన్నదానిలో నిజం లేకపోలేదు.

తరవాత నా చదువు సమస్య వచ్చింది. మా నాన్న వాదన నేర్చుకోవలసిందేకాని నేర్పటమంటూలేదని. మా అమ్మ నేర్పందే ఎలా వస్తుందనీ! భార్యా భర్తలలోనే ఒకరిభాష ఒకరిదికాదు. మా అమ్మే గెలిచింది. నన్ను చదవేశారు వీథిబళ్ళో. మా నాన్న చెప్పిన ప్రకారం ఒకనెలా, రొండు నెలలలో రావలసిన విద్య వీథిబళ్ళో రెండు సంవత్సరాలు గడిపిన తరవాత వచ్చింది. తరవాత నన్ను హైస్కూల్లో చేర్చారు.

అప్పుడు కూడా మా నాన్న చెప్పనే చెప్పాడు, యీ చదువు యెందుకూ కొరగాదని. మా అమ్మ 'చదువుకోకుండా వాడు భటాచోరల్లే తిరగాలనా మీ కోరిక?' అన్నది. 'ఈ చదువేమిటి? నేను చెప్పినట్టు చెయ్యనీ వాడు ఉద్యోగం కోసం దేబిరించకుండా నెలకు రెండువందల రూపాయలు సంపాదించే ఏర్పాటు చేస్తాను' అన్నాడు మా నాన్న. 'అబ్బో! అంతాశ ఎందుకులెండి! అయినా మీరేం చెబుతారు వాడికీ?' అన్నది మా అమ్మ. 'ఏం చెబుతానా? వడ్రంగం నేర్పుతాను. సంగీతం నేర్పుతాను. నాటకంలో వేషాలు వేయిస్తాను. రోజుకు పదిరూపాయలు సంపాదిస్తాడు' (ఈ రోజుల్లో యింకా ఎక్కువ సంపాదించవచ్చును). ఇంకో సంవత్సరంలో వాడిచేత నెలకు పదిరూపాయల వుద్యోగం చేయిస్తాను! నీ కీ విషయాలేం తెలుసును?' అన్నాడు మా నాన్న. ఆవిడ ఎగతాళిగా నవ్వి 'తెలుస్తూనే వుందిలెండి! నాటకాలూ, వేషాలూ, తాగుడూ, ముండలూ!' అంది. మా నాన్న పరధ్యానంగా మీసాలు సవరించుకుంటూ, 'నేను రొండు సంవత్సరాలపాటు వేషాలు వేశాను!" అన్నాడు.

మళ్ళీ మా అమ్మే గెలిచింది. నేను స్కూల్లో ప్రవేశించినప్పటినించీ లోకం మారటం మొదలుపెట్టింది. నేను ఇంగ్లీషు ప్రారంభం చేసిన క్షణం నించి మా అమ్మకు అర్థం

కాకుండా పోవటం మొదలుపెట్టాను. నాకు కొత్త గురువులు, కొత్త ఆదర్శాలు, కొత్త సంఘం, కొత్త సంపర్కాలూ, క్రమంగా నా చుట్టూ చేరిన సంఘంలో అతికిపోవటానికి నా వ్యక్తిత్వం పోగొట్టుకోవలిసి వచ్చింది. మా అమ్మ చెప్పినమాట వినటంలోనూ, ఈ కొత్త సంఘం బయటికి అనకుండానే శాసించే శాసనాలకు లోబడటానికి చాలా భేదం వుంది. క్రాపింగు పెట్టుకోటం, చలవబట్టలు ధరించడం, నలుగురితో నాటకాలకూ, సినిమాలకూ, హోటళ్ళకూ, సిగరెట్లకూ డబ్బులు జేబులో వుండటం మొదలయిన అలవాట్లయినై. అది తప్పుకాదని నాకు తెలుసును. మా అమ్మ కేమర్థమవుతుంది? నేనిప్పుడావిడ శిక్షణలో లేనని ఆవిడ ఎందుకు గ్రహించదు? నేనింకా ఆవిడ అదుపాజ్ఞల్లో వున్నట్టు ఎందుకు నటించటం? ఆవిడకు నా కొత్త స్వరూపం అర్థం కావటానికి ఇంటిదగ్గిర లేని వ్యక్తిత్వం తెచ్చిపెట్టుకున్నాను. ప్రతిరోజూ నా మనస్సు జ్ఞానం వృద్ధమవుతున్నవనే అహంకారం ఎక్కువ కావటం మొదలుపెట్టింది. క్రమంగా పాశ్చాత్య మర్యాదలు నేర్చుకున్నాను.

నేను బి.ఎ. పరీక్షకు పోబోతుండగా మా నాన్న పోయినాడు! నరకంలో నిద్రపోయి స్వర్గాన్ని గురించి కలలుకంటూ మేలుకుని నిజమైన పరిస్థితులు కనుక్కున్నట్టయింది నా సంగతి.

నా చదువు, నా టీ పార్టీలు, నా గర్వం నా కిప్పుడేమి సహాయం చెస్తై? నా మనసు తాగి తందనాలాడుతుంటే వికసిస్తుందనుకున్నాను. (శరీర సంబంధమయిన నిషాను గురించి వుపన్యాసాలింతమంది యిస్తున్నారు! మానసికమైన నిషాను గురించి ఎవరూ ఎందుకు మాట్లాడరు? ఇటువంటి నిషా ఒక్క ఇంగ్లీషు చదువులోనే వున్నదని పొరపాటుపడే వాళ్ళను కాళిదాసు చదవటం వల్లా, మనుచరిత్రా, వసుచరిత్రా చదవటం వల్లా ఏమయినా మనోవికాసం కలుగుతుందా అని అడుగుతాను. రాతల్లో ఇప్పటివాళ్ళు ఇంగ్లీషు సాంప్రదాయం చూపిస్తున్నారని మొత్తుకునే వాళ్ళలో ఒక్కడు మనస్సుకు ఉపకారం చేసే వాక్యం ఒక్కటి రాయలేదు. కనక అటువంటి అసందర్భపు మాటలతో తెలివితక్కువ తనం వెళ్ళబెట్టుకోక ప్రతి ఆంధ్రుడూ విధిగా ఇంగ్లీషు నేర్చుకుని కనీసం హెచ్.జి. వెల్స్ రాసిన నవలలైనా చదివి ఇరుకుసందల్లే వున్న మనస్సును విశాలపరచుకోమని సలహా యిస్తాను. పొట్లలో చుక్క ధా వత్తులూ, అరసున్నాలూ, బండిరాలూ సరిగారాస్తే చదివేటట్టూ లేకపోతే వాళ్ళను వెక్కిరిస్తూ సశేషవ్యాసాలు రాసేటట్టూ!

మొత్తానికి స్కూల్లో చెప్పిన చదువంతా దొంగ చదువు. ఇంగ్లీషు భాషను తెలిసిందేకాని దాన్ని జరపటానికి కావలసిన డబ్బు ఎక్కణ్ణించి వస్తుంది. స్కూల్లో దారిద్ర్యాన్ని శ్లాఘించే దెవరు? మా నాన్న బతికి వుండగా అన్న ఒక మాట జ్ఞాపకం వచ్చింది.

ఒకసారి నే నాయన్ను ఏ నాటకానికో డబ్బడిగాను. ఆయన యిస్తూ 'ఈ నెల నీ కింద పదిహేను రూపాయలు ఖర్చయింది. తెలుసునా?' అన్నాడు. మా అమ్మ వెంటనే 'అయ్యో, అదేమిటండీ! అలా అంటారు.' అన్నది. ఆయన శాంతంగా ఆవిడ వైపు తిరిగి 'తప్పులేదు. వా డీ డబ్బు పాతట్లోనించి రావటం లేదని తెలుసుకోవటం మంచిదికాదా?' అన్నాడు.

ఆయనే నా తండ్రి కాకుండా తల్లయి వుంటే! బిడ్డలను గురించిన ఎన్ని పుస్తకాలు అటువంటి తల్లితో సమానం!"

అది చదవటం పూర్తిచేసి చాలాసేపు ఆలోచిస్తూ కూర్చున్నాను. తరవాత వాడితో 'ఒరే, సూరీ! నువ్వింతకన్న పిల్లల పెంపకంమీద వ్యాసం రాయరాదా?' అన్నాను.

'నేను చూస్తున్నాను! ఏదైనా నా నోటినించి వచ్చినా నేను రాస్తే చదివినా నీలో ఒక విధమయిన అసంతృప్తి కనబడుతుందెందువల్ల?'

నేను చెప్పలేనన్నాను. వాడన్నమాట నిజమే. వాడొక విషయాన్ని గురించి చాలాసేపు మాట్లాడినా దానిచుట్టూ తిరుగుతాడు తప్ప దాన్ని తాపడు.

సూరి తల ఊపి, 'బహుశా నువ్వొక పొరపాటు చేస్తున్నావు. ఆవును గురించి నేను మాట్లాడటం మొదలుపెడితే దానికి రొండు చెవులు, కళ్ళూ, కొమ్ములు మొదలయినవి వుంటవని ఇన్ఫర్మేషన్ యిస్తానని నీ అభిప్రాయం. అవునా?' అన్నాడు.

'అదుగో! అది. ఆ పని చెయ్యవు!'

'ఆ పని చేస్తే నీకేం ఉపకారం? ఒక సబ్జక్టును గురించి నువ్వేవిధంగ ఆలోచించాలో చెబుతాను. ఆ ఆలోచన కూడా నన్నే చెయ్యమంటే ఇక నువ్వు చేసేదేమిటి? నేను శిశుపోషణమీద పుస్తకం రాస్తే భేష్ బాగా రాశాడంటారు. ఒక్కరూ చదవరు. పిల్లలు ఎప్పటి మోస్తరుగానే పోషింపబడుతూ వుంటారు. పుస్తకాలు కాదు, ఒక తల్లి అవసరం. ప్రతి ఆడదాన్ని అద్భుతమయిన తల్లిని చెయ్యాలి!'

'సరే నీ ఒక తల్లి అలా వుండనీ కాని, ఈ వ్యాసం ఏం చెయ్యదలచుకున్నావు?'

'ఎందుకు?'

'నాకియ్యి! పత్రికలకు పంపిస్తాను.' అన్నాను.

సూరి నా చేతిలో కాగితాలు లాక్కుని 'అంతకన్న తగలబెట్టటానికి ఒప్పుకుంటాను' అన్నాడు.

వాడు చూడకుండా నేను నాలిక కొరుక్కున్నాను. వాడికింకా తెలీదు! ఇంకా వారం రోజులు కూడా కాలేదు. నేనీ మధ్య ఒక మాసపత్రికలో చక్కని వ్యాసం పడితే చదివి వినిపించాలని ప్రయత్నం చెయ్యటం. నేను 'తెనుగన్నలారా... నడుములు కట్టుకొనుడు!'

అని భావయుక్తంగా చదవగానే సూరి 'షటప్, యూ ఇడియట్!' అంటూ కళ్ళు పెద్దవిచేసి నా మీద లేవటం! సూరిని గురించి ఈ విధంగా రాస్తున్నందుకు వాడెప్పుడో నా పని పట్టిస్తాడు!

***మొదటి ముద్రణ : ఆంధ్రభూమి, ఆశ్వీయుజం 1934***